ప్రజాశక్తి
గురువారం 12 సెప్టెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

పార్వతీపురంలో వందే భారత్‌కు హాల్ట్

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఈ నెల 15న ప్రారంభించే దుర్గ్ - విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు పార్వతీపురంలో హాల్ట్ కల్పించారు. ఈ రైలు దుర్గ్ నుంచి మధ్యాహ్నం 12.28 గంటలకు పార్వతీపురం చేరుకుంటుంది. 12:30 గంటలకు బయలుదేరి 2:30 గంటలకు విశాఖపట్నం వెళ్తుంది. మళ్లీ విశాఖపట్నంలో మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి పార్వతీపురం 5.13 గంటలకు చేరుకుంటుంది. విశాఖపట్నం నుంచి పార్వతీపురం, రాయపూర్ వెళ్లే వారికి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్టేషన్ మాస్టర్ వెంకటరమణ అన్నారు.

రాళ్లు తేలిన రహదారిపై రేషన్ బియ్యం తీసుకెళ్తున్న గిరిజనులు

ఏజెన్సీలో గిరిజనులకు ఏదో ఒక రూపంలో కష్టాలు తప్పడం లేదనడానికి ఈ చిత్రమే నిదర్శనం. పెద్దరాళ్లు తేలి, వాహనాలు రాకపోకలు సాగించలేని, కనీసం నడవడానికి కూడా అవకాశం లేని విధంగా తయారైంది రోడ్డు. రేషన్ కోసం వచ్చిన గిరిజనులు రాళ్లు తేలిన రహదారిపై నానా అవస్థలు పడుతూ గ్రామాలకు చేరుకోవాల్సిన దుస్థితి. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్న ప్రభుత్వ ఆర్భాట ప్రచారాలు తప్ప క్షేత్రస్థాయిలో గిరిజనులకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకునే ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులే కరువయ్యారని చెప్పొచ్చు. గిరిజన గ్రామాలకు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి నెలకొంది. రాళ్లు తేలిన రహదారులపై నిత్యం గిరిజనం నరకయాతన అనుభవిస్తున్నారు.

రాళ్లు తేలిన రహదారిపై నర(డ)కయాతన

- రాకపోకలకు గిరిజనుల అవస్థలు
- రేషన్ కోసమూ ప్రయాసే
- అనేక గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్ రావడమూ కష్టమే

ప్రజాశక్తి-కొమరాడ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని అనేక గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు లేకపోయినా, గిరిజన ప్రాంతాల అభివృద్ధి ధ్యేయమని పాలకులు, ఐటిడిఎ అధికారులు చెబుతున్న మాటలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. అంతేతప్ప క్షేత్రస్థాయిలో ఎక్కడా ఆచరణకు నోచడం లేదు. తరాలు మారుతున్నా గిరిజనుల రహదారి సమస్యలు మాత్రం మారడంలేదు. కొమరాడ మండలంలోని కుంతేసు గ్రామ గిరిజనులు రేషన్ తీసుకోవాలంటే గతంలో

జర్నకు వెళ్లే రోడ్డు ఇలా..

ఎండబద్ర జిసిసి డిపోకు వచ్చేవారు. గత వైసిపి ప్రభుత్వం వచ్చాక ఇంటింటికి రేషన్ పంపిణీ పేరుతో వాహనాలను ఏర్పాటు చేసినా, గిరిజన ప్రాంతాల్లో అలా పంపిణీ సాధ్యపడటం లేదు. దీంతో రోడ్డు సదుపాయాలు లేక గిరిజన గ్రామాలకు కూడా రేషన్ పంపిణీ వ్యాన్ వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఎక్కడో ఒక ప్రదేశంలో రేషన్ ఇచ్చేందుకు వెళ్తున్నాయి. దీంతో లంజి గ్రామం వరకు రేషన్ పంపిణీ వాహనం వస్తే, గిరిశిఖర ప్రాంతాల్లో ఉన్న కుంతేసు, బిన్నిడి, గొర్లెమ్మ తదితర గ్రామాల గిరిజనులు అక్కడే రేషన్ తీసుకుంటున్నారు. రాళ్లు తేలిన రహదారిపై నడుచుకొని రేషన్ కోసం అష్టకష్టాలు పడుతూ మైదాన ప్రాంతాలకు రావలసిన పరిస్థితి ఏర్పడింది. గతంలో చేపట్టిన రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలేయడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ కోరుకుపోతున్నాయి. దీంతో రేషన్ కోసం రాళ్లు తేలిన రహదారిపై గిరిజనులు నరకయాతన అనుభవిస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇలాంటి గిరిజనులు కింద పడి గాయాలైన ఘటనలు కూడా గతంలో అనేకం ఉన్నాయి.

వనకాబడికి వెళ్లే మార్గమిదే

గిరిజన అభివృద్ధి కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పాలకులు చెబుతున్నారని, ఆ నిధులతో కనీసం రోడ్డు సదుపాయాలు కల్పిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గిరిజనులు చెబుతున్నారు. రహదారి సదుపాయం ఏర్పాటు చేస్తే మారుమూల గిరిజన గ్రామాలకు అన్ని వసతులు సమకూర్చేందుకు కూడా ప్రభుత్వానికి, అధికారులకు సులభతరంగా ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి, గిరిజన రహదారులపై దృష్టి పెట్టాలని, ప్రతి గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

మరిన్ని రోడ్ల పరిస్థితి..

2014లో టిడిపి ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లన్నీ ఇప్పుడు అధ్వానంగా మారాయి. వర్షాలకు రోడ్లన్నీ పూర్తిగా కోరుకుపోయాయి. గత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెన్సీ కొండ ప్రాంతాల్లో రోడ్లు వేయకుండా, కొంతమేరకు మైదాన ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయాలు కల్పించింది. గతంలో వేసిన మట్టి రోడ్లు వరద తాకిడికి పూర్తిగా కొట్టుకుపోయాయి. గిరిజనులకు ఏ చిన్న కష్టం వచ్చినా ఆ దయనీయ పరిస్థితుల్లో ఉన్న రహదారులపైనే ప్రయాణాలు చేయాల్సిన దుస్థితి తప్పడం లేదని వారంతా గగ్గోలు పెడుతున్నారు.

» 2018లో నయా పంచాయతీ వనకాబడి, చిన్నఖేర్జల పంచాయతీ సర్వపాడు నుంచి లోడ్డ గ్రామాలకు కేవలం మట్టి పనులే చేసి, రోడ్డును చదును చేసి వదిలేశారు. వర్షాకాలంలో కొండ ప్రాంతాల నుంచి పడిన వర్షాలతో వరదల ప్రవాహానికి రోడ్లన్నీ పూర్తిగా కోరుకుపోయి నడిచి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రస్తుతం రాళ్లు తేలి, కోతకు గురవడంతో అత్యవసర సేవలైన అంబులెన్సులు కూడా ఆ మార్గంలో వెళ్లేందుకు అవకాశం లేదు. రోగులను తీసుకొచ్చేందుకు కనీసం ఫీడర్ అంబులెన్సు కూడా ఆ రోడ్డుపై కూడా వెళ్లే మార్గం లేదు. దీంతో గిరిజనులు డోలీ కట్టుకొని రోగిని తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది.

» నాగావళి నది ఆవల ఉన్న గుణద తీలేసు పంచాయతీకి చెందిన ఎగువగుణద, దిగువగుణద, జర్నబడ్డిడి, తనకు, తదితర గ్రామాలకు కనీసం రోడ్డు సదుపాయం లేదు. ఆ దారిలో నడిచి వెళ్లాలంటే.. తుప్పలు, డొంకలతో నిండిన నడకదారి మాత్రమే ఆధారం. అదికూడా రాళ్లు తేలిపోయిన, కొండలు, గుట్టలు దాటుకొని ఎక్కాల్సిన పరిస్థితి.

ధర్నా చేస్తున్న వ్యకాస, కెవిపిఎస్ నాయకులు, శివ్వాం దళితులు

గరుగుబిల్లి తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

శివ్వాం దళితుల భూమి సమస్యను పరిష్కరించాలి ● వ్యకాస, కెవిపిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

శివ్వాం దళితులు గత కొన్నాళ్లుగా సాగుచేస్తున్న భూమిపై పెత్తందార్లకు అనుకూలంగా వ్యవహరించిన గరుగుబిల్లి మండల తహశీల్దార్‌ని సస్పెండ్ చేయాలని కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన బుధవారం ధర్నా నిర్వహించారు. తొలుత స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందించడానికి ప్రయత్నించారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో విరమించుకున్నారు.

ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డు కమిషనర్ రాసిన ఉత్తరం, ఆర్‌డిఒ నివేదిక, గరుగుబిల్లి తహశీల్దార్ నివేదిక, బాధితులకు అందించిన నివేదికలు అవాస్తవాలతో ఉన్నాయని తెలిపారు. తహశీల్దార్ ఇచ్చిన నివేదికలో ఎస్ఎఫ్ఎలో దళితుల పేర్లు నమోదై ఉన్నాయి, నోషనల్ ఖాతాలో కూడా వారి పేర్లు ఉన్నాయి కానీ డి.పట్టాలు ఇవ్వనందున ఎటువంటి ఆధారాలూ లేవని పేర్కొన్నారన్నారు. డి.పట్టాలు దళితులకు ఇవ్వకపోతే గుండ్రెడ్డి సుబ్బనాయుడు తదితరులు దళితులపై ఇంజక్షన్ ఆర్డర్ కోరుతూ కోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఎలో స్పష్టంగా నమోదు చేసి ఉందని, దళితుల సాగులో ఉన్నట్లు వన్‌బిలో కూడా నమోదైందని చెప్పారు. ఇవన్నీ అబద్ధాలా? లేదా దళితులే రెవెన్యూ రికార్డులు రాసుకున్నారా? అని ప్రశ్నించారు. ఆ వాస్తవాలను కప్పి పెట్టేందుకు తహశీల్దారు ఈ విధంగా నివేదికను పొందుపరిచారని చెప్పారు. కోర్టు వివాదంలో ఉన్న 22.80 ఎకరాలకు బదులు 36 సర్వే నెంబరు చూపిస్తున్నారని తెలిపారు. కోర్టు వివాదంలో ఉన్న సర్వే నెంబరు 28, 30 తప్పించి 36 సర్వే నెంబరును చూపిస్తుండడం విడ్డూరమని, సర్వే నెంబరు 36 వివాదంలో ఉంటే కొన్నేళ్ల క్రితం ఆ భూమికి డి-పట్టాలు ఎలా అందించారని మండిపడ్డారు.

వివాదంలో ఉన్న 20 ఎకరాల భూముల్లో గొర్లి సత్యం మరో ముగ్గురు ఉన్నారని తహశీల్దారు నివేదికలో ఉందని, దళితులు జూన్ 19 నుండి 25 వరకు భూమిని దున్ని, వరినారు వేసిన విషయం అందరికీ తెలుసని, రెండు రోజుల తర్వాత పెత్తందారులు 100 మందిని తీసుకువచ్చి దళితులపై దాడి చేశారని చెప్పారు. దీనికి గరుగుబిల్లి ఎస్ఐ, ఎఎస్ఐలే సాక్ష్యమని చెప్పారు. గొర్లి సత్యం మరో ముగ్గురు ఆ భూమిలో సాగు చేస్తుంటే దళితులు వారం రోజులు సాగు చేస్తున్నా ఎందుకు అడ్డుకోలేదని నిలదీశారు. ఇదంతా దళితులపై కుట్రపూరితమైన దాడి కాబట్టే ఏ రెవెన్యూ అధికారి కూడా ఆ గ్రామానికి ఇంతవరకు వెళ్లలేదన్నారు. తహశీల్దార్ వెళ్ళకపోవడం చట్టరీత్యా నేరమని, 2014లో హైకోర్టు ఇంజక్షన్ ఆర్డర్ పక్కన పెట్టిన దగ్గర నుండి దళితులే ఆ భూమి సాగు చేసుకుంటున్నారని వివరించారు. తహశీల్దార్ పెత్తందార్లతో కుమ్మక్కైన కారణంగా తమకు తప్పుడు నివేదిక ఇచ్చారని తెలిపారు. తప్పుడు నివేదిక ఇచ్చి, తప్పుదోవ పట్టించిన గరుగుబిల్లి మండల తహశీల్దారును సస్పెండ్ చేసి, దళితులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. దళితులను కులం పేరుతో తిట్టి, దాడి చేసిన పెత్తందాలను ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టప్రకారం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేగిడి ఎల్లమ్మ, యచ్చుట కిరమ్మ, రేగిడి అప్పలస్వామి, తెర్లింగి లక్ష్మణరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు కారణం చంద్రబాబే

- వరద బాధితులకు టిడిపి చేసింది శూన్యం
- మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

విజయవాడలో వరదలకు గత వైసిపి ప్రభుత్వమే కారణమని టిడిపి నాయకులు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. విజయవాడ ముంపునకు సిఎం చంద్రబాబే కారణమని ఆరోపించారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు వరదల నియంత్రణకు తీసుకున్న ముందస్తు చర్యలు ఏమిటని ప్రశ్నించారు. విజయవాడను అభివృద్ధి చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారన్నారు. సిఎంగా వైస్ జగన్మోహన్ రెడ్డి రిటైనింగ్ వాల్ నిర్మించడం వల్ల విజయవాడలోని కృష్ణలంక ప్రాంతం సురక్షితంగా ఉందని, ఆ ప్రాంత ప్రజలు జగన్ కొనియాడుతున్నారన్నారని చెప్పారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. నాణ్యమైన ఆహారం, తాగునీరు అందించలేదని సిపిఎం నాయకులు సైతం ఆరోపిస్తున్నారన్నారు. టిడిపి అనుకూల మీడియా తప్ప మిగిలిన అన్ని మీడియా సంస్థలు వాస్తవ కథనాలు ప్రచురిస్తున్నాయన్నారు. ఎల్లో మీడియాలో ప్రభుత్వం చేసిన దానికన్నా చాటుకుంటున్నది ఎక్కువగా ఉందని ధ్వజమెత్తారు.

అధికవరదల సమయంలో సకాలంలో ఆహారం అందక ఆకలిచావులు కూడా సంభవించాయన్నారు. పాడైపోయిన ఆహార పదార్థాలు సరఫరా చేశారని బాధితులే చెప్పారని అన్నారు. వైసిపి నాయకులు కుట్రపన్ని ప్రకాశం బ్యారేజ్‌కి అడ్డంగా బోట్లు పెట్టారని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కుట్రకోణం దాగుందని ప్రభుత్వం భావించినప్పుడు నిజాలు నిగ్గుతేల్చేందుకు సిబిఐతో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యత గల ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధితులను ఆదుకోవాలే తప్ప మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై అడ్డగోలు ఆరోపణలతో కాలం వెల్లదీయకూడదని హితవుపలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సర్పంచులు జరజాపు మోహన్, బంకురు తిరుపతినాయుడు, సీదరపు నూకయ్య, వైసిపి నాయకులు కళ్లేపల్లి త్రినాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విడివికెల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి- పార్వతీపురం

వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో జీవనోపాధుల కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. విడివికె ద్వారా మార్కెట్‌లో డిమాండు ఉన్న వస్తువులను తక్కువ ఉత్పత్తి వ్యయంతో తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు కావలసిన వస్తువులను విడివికె, స్వయం సహాయక సంఘాల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విడివికెలు జిల్లాలో లభ్యం అవుతున్న అన్ని పంటల కొనుగోలుతో పాటు పాడిపశువుల నిర్వహణ, దర్జీ పని, సివిల్ కాంట్రాక్ట్ పనులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ వంటి బహుముఖ పనులు చేపట్టవచ్చని చెప్పారు. లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని డిఆర్‌డిఎ పీడీని ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఐటిడిఎ, జిల్లా పరిశ్రమల శాఖ, నాబార్డు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య శాఖ, మెప్మా, చేనేత - జౌళి శాఖ తదితర విభాగాలు తమ పరిధిలో ఉపాధి అవకాశాల కల్పనకు అన్ని వనరులు ఉపయోగించుకోవాలని సూచించారు. గుమ్మలక్ష్మీపురం వైటిసిలో 30 మందికి కుట్టుమిషను, బ్యుటీషియన్ కోర్సు శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేయాలని తెలిపారు. ప్రతి వారం కొన్ని ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం, జాబ్ మేళాలు ఎక్కువగా నిర్వహించడం, అన్ని దుకాణాలకు మన ఉత్పత్తులు సరఫరా చేయడం వంటి కార్యక్రమాలు జరగాలని ఆయన స్పష్టం చేశారు.

సమావేశంలో జెసి ఎస్.ఎస్. శోభిక, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యం నాయుడు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు. సాయికుమార్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జె ఎల్ ఎన్ మూర్తి, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి డిఎస్ దినేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగావళి నదిలో కేబుళ్లను సరిచేస్తున్న కార్మికులు

నీటి ఉధృతికి తెగిన మోటార్ కేబుళ్లు

ప్రజాశక్తి- పార్వతీపురంటౌన్

ఒడిశాలో కురిసిన భారీ వర్షాలకు నాగావళి నదిలో నీటి ప్రవాహం ఎక్కువైంది. దీంతో తోటపల్లి రిజర్వాయర్ చెంతనే ఉన్న రెండు ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో నీటి సరఫరా చేసే మోటార్ కేబుళ్లు తెగిపోయాయి. దీంతో సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, ఎఇ జి.ఆనంద్ బుధవారం తోటపల్లి వద్ద ఉన్న హెడ్ వాటర్ పంప్‌హౌస్‌ను సందర్శించారు. మోటార్ కేబుళ్లను పరిశీలించారు. నీటి సరఫరాకు అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఎఇని కమిషనర్ ఆదేశించారు. దీంతో మున్సిపల్ తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది మరమ్మతులను చేపట్టి కేబుళ్లను పునరుద్ధరించారు.

అభివృద్ధి పనులు మంజూరు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని కొండవీధిలో కల్వర్టు, పెంకుటిల్లు కాలనీలో సిసి రోడ్డు, కాలువలు, నూకాలమ్మ తల్లి ఆలయానికి సిసి రోడ్ మంజూరైనట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు.

రైతులను ఆదుకోవాలని నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

రైతులు, కౌలురైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని అడ్డాపుశిల, బాలగొడబ, కోరిగంగాపురంలో సచివాలయాల ఎదుట ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన రైతులు నిరసనలు చేపట్టారు. అనంతరం అనంతరం సచివాలయ కార్యదర్శులకు వినతుల అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం హామీనిచ్చిన రూ.20 వేలు వెంటనే చెల్లించాలన్నారు. 2023 ఖరీఫ్, రబీ సీజన్లలో కరువు, తుపాన్లతో నష్టపోయిన పంటలకు బీమా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పార్వతీపురంరూరల్.. అడ్డాపుశీల సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, రైతుసంఘం నాయకులు

కొమరాడ : రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు ఎ.ఉపేంద్ర ఆధ్వర్యాన కొమరాడ, గుమడ సచివాలయాల్లో బుధవారం వినతులు అందించారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని ఉపేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 25, 26వ తేదీల్లో తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు రెడ్డి శివున్నాయుడు, గిరిజన సంఘం జిల్లా నాయకులు రాము, సుబ్బారావు, రైతులు రాంబాబు, పోలీస్ పాల్గొన్నారు.

సీతానగరం : రైతులు, కౌలురైతుల సమస్యలను పరిష్కరించాలని పెదభోగిలి గ్రామ సచివాలయంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిపోయాయని, పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేల పెట్టుబడి సాయం వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు బీమా పరిహారం చెల్లించాలన్నారు. లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే తెరిపించి నడిపించాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు మీసాల అచ్యుతరావు, బొత్స లక్ష్మణరావు, మీసాల సింహాచలం, పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : పెట్టుబడులకు డబ్బులు లేక రైతులు అనేక అవస్థలు పడుతున్నారని, ఆర్థికంగా ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు కె.గంగునాయుడు ఆధ్వర్యంలో స్థానిక సచివాలయ కార్యదర్శికి వినతి సమర్పించారు. కౌలురైతులకు భూ యజమానితో సంతకంతో సంబంధం లేకుండా కౌలుకార్డులు ఇచ్చి రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బి.మోహనరావు రైతులు పాల్గొన్నారు.



సీతానగరం, కొమరాడ.. సచివాలయాల్లో వినతులు అందజేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

కూలిన మిద్దె ఇల్లు

కూలిన ఇల్లు

పార్వతీపురం రూరల్ : సంఘంవలస పంచాయతీ పరిధిలోని చొక్కాపువాని వలసకు చెందిన చొక్కాకు విజయమ్మ మిద్దె ఇల్లు బుధవారం కూలిపోయింది. వర్షాలకు తడిచిపోవడంతో పూర్తిగా నానిపోయి కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విఆర్ఒ శంకర్రావు నష్టాన్ని అంచనా వేశారు.

కవితా పోటీల్లో దేవానంద్ ప్రతిభ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలోని మారుమూల మండలమైన గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ కవులు తమ ప్రతిభతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తెలుగు జాతి కీర్తి శిఖరం ఎన్‌టిఆర్.. అనే అంశంపై జాతీయస్థాయిలో శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన కవితా పోటీల్లో గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన పాలక దేవానంద్ విజేతగా నిలిచారు. దేవానంద్ మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తు న్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తి మండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి.. దేవానంద్‌కు ప్రశంసా పత్రాన్ని పంపించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పాలకొండలో 17న జాబ్‌మేళా

పాలకొండ : పాలకొండలో మెగా జాబ్ మేళాను ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జయకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం పాలకొండలో పోస్టర్‌ను విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, ఎంఎస్‌సి విద్యార్హతలు కలిగి, 18 నుండి 30 ఏళ్ల యువతీ, యువకులు అర్హులని ఆయన తెలిపారు. జాబ్‌మేళా 17న ఉదయం 9 గంటల నుండి పాలకొండ శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో జరుగుతుందన్నారు. ఈ మెగా జాబ్‌మేళాకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని, 1050 పోస్టులు ఆయా కంపెనీలలో భర్తీ చేస్తున్నారని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6301275511, 7993795796 ఫోన్ నంబర్లకు సంప్రదించ వచ్చని తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే సేవలు

పార్వతీపురం రూరల్ : విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం చేపట్టిన సహాయక చర్యల్లో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నిమగ్నమయ్యారు. క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ముంపుకష్టాల్లో ఉన్నవారికి సిఎం చంద్రబాబు భరోసా కల్పిస్తూ, త్వరలో కోలుకునేలా చేశారని ఆయన తెలిపారు. అనంతరం వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డిని ఎమ్మెల్యే కలిసి, నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

సీతానగరం : విజయవాడ వరద బాధితులకు పార్వతీపురం ఎమ్మెల్యే భూమిల విజయచంద్ర పిలుపుమేరకు మండలంలో టిడిపి నాయకులు విరాళాలు సేకరించారు. గెడ్డలుప్పిలో రూ.10 వేలు, లక్ష్మీపురంలో రూ.15 వేలు, చెల్లంనాయుడువలస సర్పంచ్ వి.పారినాయుడు ఆధ్వర్యాన రూ.22,500, తామరకండిలో 10 వేలు, బక్కుపేట సర్పంచ్ గొట్టాపు మంగమ్మ అప్పారావు ఆధ్వర్యాన రూ.10 వేలు, ఆర్.వెంకన్నపేటలో రూ.2 వేలు సేకరించినట్లు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఆర్.వేణుగోపాల్ నాయుడు తెలిపారు. వీటిని సిఎం సహాయనిధికి పంపిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వి.పారినాయుడు, పి.సత్యం నాయుడు, ఎస్.హరిగోపాలరావు, కె.అరవింద్ కుమార్, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

మాలతీదొర మరణంతో తీవ్రనష్టం : మంత్రి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్, సాలూరురూరల్

గిరిశిఖర గ్రామాల్లో టిడిపికి విశేష సేవలందించిన గిరిజన నాయకుడు మాలతీదొర మరణం చాలా దిగ్భ్రాంతికి గురి చేసిందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మండలం డికెపట్నం పంచాయతీ జోగిదరమెట్టకు చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త మాలతీదొర ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని బుధవారం మంత్రి పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం సాలూరు మండలం మామిడిపల్లిలో ఇటీవల మరణించిన పిఎసిఎస్ కార్యదర్శి హరి నాగరాజు కుటుంబాన్ని, విద్యుత్ షాక్‌తో మరణించిన సీదరాపు సుందరమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, జరజాపు సూరిబాబు, ఆముదాల పరమేశ్, బుస తవుడు, డొంక అన్నపూర్ణ, తాడుతురి తిరుపతి రావు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

కొమరాడ : గ్రామాల్లో ఉన్న ప్రజలకు హెచ్‌ఐవి, టిబి వ్యాధులపై అవగాహన అవసరమని చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్ హరికృష్ణ అన్నారు. బుధవారం శివిని గ్రామంలో హెచ్‌ఐవి, టిబిపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి సోకిన వారి పట్ల వివక్షత చూపకూడదని సూచించారు.

పాఠశాల సందర్శన

సీతంపేట : మండలంలో సార, మూర్తికాడిగూడ, కోతాము, మల్లి పాఠశాలలను ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు బుధవారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకదృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వాసుదేవరావు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

పార్వతీపురం టౌన్ : జిల్లాలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం నుండి రాయగడ మార్గంలో గుమడ, కొమరాడ, చోళ్లపదం, కూనేరు తదితర ప్రాంతాలలో పెద్ద గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుందని చెప్పారు. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. తక్షణమే రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించి ప్రమాదాలను నివారించాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో ఆటల పోటీలు

భామిని : భామిని ఆదర్శ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఆటల పోటీలను బుధవారం నిర్వహించారు. పోటీలను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.శివకుమార్ ప్రారంభించారు. మొదటి రోజు ఖో -ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ ఆటల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి, నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపిస్తామని ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో పిఇటి శివరాం ప్రసాద్, సిఆర్‌పి ప్రసాద్ ఉన్నారు.

13న విద్యుత్తు సరఫరా నిలిపివేత

గుమ్మలక్ష్మీపురం : ఈ నెల 13న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు లైన్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నామని, ప్రజలు గమనించాలని కోరారు.

కష్టపడి చదివితే ఫలితం

వీరఘట్టం : కష్టపడి చదివితే ఫలితం దక్కుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాథ్ అన్నారు. కళాశాలలో ఎంపిసి చదివిన విద్యార్థి కొత్తవలస ఆశకు అమరావతిలోని సిఎస్‌సి యూనివర్సిటీలో ఉచితంగా సీటు రావడంతో బుధవారం ప్రిన్సిపల్ ఆశను అభినందించారు. మరింత కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థికి సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.కుమారస్వామి, టి.బాలమురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సందర్శన

సీతంపేట : మండలంలోని మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎంపిడిఒ గీతాంజలి సందర్శించారు. ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతి గది కోసం ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. గ్రామస్తులు, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి, అక్కడ పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

సంజీవనాయుడుకు సన్మానం

బలిజిపేట : పెదపెంకి గ్రామంలో మూడు దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడును మాజీ ఎంపిపి పెంకి వేణు గోపాల్ నాయుడు సన్మానించారు. బుధవారం కొత్త వీధి యువత సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

బుడ్డిపేటలో పొలంబడి

సీతానగరం : మండలంలో బుడ్డిపేట గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎఒ అవినాష్ మాట్లాడుతూ వరి పంటలో పురుగులను, తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు పి.లక్ష్మణ్, బి.సుధీర్ పాల్గొన్నారు.

కుడ్డపల్లిలో..

సీతంపేట : మండలంలో కుడ్డపల్లి గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పిలకల కత్తిరింపు ప్రయోగంపై పి.శ్రీదేవి రైతులకు అవగాహన కల్పించారు. శత్రు, మిత్ర పురుగులపై వివరించారు.

జిఒ 115ను రద్దుచేయాలని నర్సుల ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లా కేంద్రాస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న నర్సులు

జిఒ 115ను రద్దుచేసి, నోటిఫికేషన్ ద్వారా స్టాఫ్ నర్స్ పోస్టులు భర్తీ చేయాలని పార్వతీపురం జిల్లా కేంద్రసుపత్రి నర్సుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రాసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ వల్ల ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నర్సుల నోటిఫికేషన్‌కు విఘాతం కలుగుతుందన్నారు. మూడున్నర ఏళ్ల జిఎన్‌ఎం కోర్సు, నాలుగేళ్ల బిఎస్‌సి నర్సింగ్ కోర్సులు చదివి, చాలాకాలంగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలు అందిస్తున్నామని తెలిపారు. తమను విస్మరించి, సచివాలయాల్లో పనిచేస్తున్న ఎఎన్‌ఎంలను ఇక్కడ స్టాఫ్‌నర్సులుగా నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. అందుకోసం విడుదల చేసిన జిఒను రద్దు చేయాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం : ఎఎన్‌ఎం నుంచి జిఎన్‌ఎం ఇంటెన్సిఫైడ్ వారికి స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలను ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం నిరసన వ్యక్తం చేశారు. జిఒ 115ను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది డిమాండ్ చేశారు.

భూసమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-సాలూరురూరల్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

జిల్లాలో భూ సమస్యల పరిష్కరిస్తామని జిల్లా యంత్రాంగం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన సిపిఎం సాలూరు మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శివ్వాం దళితుల భూసమస్యపై జిల్లా ఉన్నతాధికారులు హామీ ఇచ్చి చాలా రోజులు గడుస్తున్నా నేటికీ పరిష్కరించలేదన్నారు. గరుగుబిల్లి తహశీల్దార్ ఈ భూమిపై కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి, అక్కడి పెత్తందారులకు కొమ్ముకాశారని, వెంటనే ఆ తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. బొర్రపనుకువలస, జిల్లేడువలస, కుడుమూరు భూముల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సాలూరు నుంచి మక్కువ వెళ్లే రహదారిని మండల నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజన్నదొర, ప్రస్తుత మంత్రి సంధ్యారాణి నిత్యం ఇదే రహదారిపై ప్రయాణం సాగించాలి కానీ ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని రెడ్డి వేణు అన్నారు.

రోడ్డుపై కనీసం వాహనాలు వెళ్లడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొందన్నారు. దీని కారణంగా బస్సులు తిరగడం ఆగిపోయాయని, దీంతో సామాన్యులపై తీవ్ర ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు సీదరపు అప్పారావు, వంతల సుందర్రావు, కూనేటి చినబాబు, గేమ్మెల జానకిరావు, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం చేపడతాం

ఎమ్మెల్యే జగదీశ్వరి

గెడ్డను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

గొటివాడ పంచాయతీలో గెడ్డపై వంతెన నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం మండలంలో గొటివాడ పంచాయతీలో గెడ్డను గిరిజనులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో గెడ్డ ఎక్కువగా రావడంతో బోరిబండిగూడ, నిడగల్లుగూడ, బల్లేరు, కిడికేసు, బోరుగూడ, బల్లేరుగూడకు వెళ్లాలంటే గిరిజనులు ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజనుల సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. గెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టి, గిరిజనులకు సురక్షితమైన ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య పాల్గొన్నారు.

మారిషస్ ఫైనాపిల్ మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-సీతంపేట

ఫైనాపిల్ మొక్కలు పంపిణీ చేస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్

మారిషస్ అనే కొత్త రకం ఫైనాపిల్ మొక్కలను సీతంపేట, భామిని మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. అందులో భాగంగా బుధవారం కీసరజోడు, దిబ్బగూడ గ్రామాల్లో గిరిజన రైతులకు మారిషస్ ఫైనాఫిల్ మొక్కలను ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పంపిణీ చేశారు. ఎస్‌సిఎ టు టిఎస్‌ఎస్ పథకం కింద 90 శాతం రాయితీతో వీటిని పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు ఎకరాకు 8 వేల ఫైనాపిల్ మొక్కలు అందించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఐటిడిఎ ద్వారా కల్పిస్తున్న పథకాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారిషస్ రకం ఫైనాఫిల్ సాగు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. సీతంపేట, భామిని మండలాల్లో 110 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా ఈ మారిషస్ రకం మొక్కలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, పిహెచ్ఒ ఎస్.వి.గణేష్, హెచ్ఒ జయశ్రీ, నాయకులు సవరతోట మొఖలింగం, తదితరులు పాల్గొన్నారు.

టీకాలు సకాలంలో వేయాలి

మందులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ జగన్మోహనరావు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

టీకాలు సకాలంలో వేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ టి.జగన్మోహనరావు, డిపిఎంఒ రఘుకుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. పార్వతీపురం మండలంలోని నర్శిపురం, వెంకంపేట హెల్త్ వెల్నెస్ కేంద్రాలను బుధవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీలు, చికిత్స, నిర్ధారణ పరీక్షల వివరాలను ఒపి రికార్డులో పరిశీలించారు. గ్రామాల్లో జ్వరాలు ఏ మేరకు ఉన్నాయి, వారిని ఏవిధంగా పర్యవేక్షణ చేస్తున్నారు అని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. టీకా కార్యక్రమంలో బుధవారం టీకా వేసిన పిల్లలు, గర్భిణుల వివరాలు పరిశీలించారు. రక్తహీనత ఉన్న గర్భిణులు, కిశోర బాలికలను గుర్తించి త్వరగా హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది రాజేశ్వరి,అనుశ్రీ,ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

ఐటిడిఎ పరిధిలో గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని డిప్యూటీ డిఇఒ సిహెచ్ సుగుణ అన్నారు. బుధవారం జియ్యమ్మవలస మండలంలో వనజ, సీమలవానివలస, బొడ్డవలస, తుమ్మిగూడ పాఠశాలలను తనిఖీ చేశారు. బొడ్డవలస పాఠశాలలో రికార్డులు సరిగ్గా లేవని, విద్యాబోధన సంతృప్తికరంగా లేదని ఆమె మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిసిడిఒ పి.కొండమ్మ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అల్లు రవి ప్రసాద్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వనమహోత్సవం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వన మహోత్సవాన్ని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి 60 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వన మహోత్సవం ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సరైన వసతి కల్పించాలి

ప్రజాశక్తి -భామిని

ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు సరైన వసతి సౌకర్యం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే వి.కళావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భామినిలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవనాలను బుధవారం ఆమె పరిశీలించారు. విద్యార్థులకు సరైన వసతి లేక, ఇతర వసతిగృహాల్లో ఉండి, చదువుతూ ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆమె తెలిపారు. భవనాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, పోతల మజ్జి, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, పాపి నాయుడు, గెల్లంకి రమేష్ పాల్గొన్నారు.

జిఒ 85కి వ్యతిరేకంగా దశల వారీగా ఆందోళన

ప్రజాశక్తి -భామిని

ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ 85కి వ్యతిరేకంగా దశల వారీగా ఆందోళన చేపడతామని భామిని పిహెచ్‌సి వైద్యులు పి.సోయల్, సంతోష లక్ష్మి, దీపికరాణి, కొండపల్లి రవీంద్ర, దామోదరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిఒ 85తో పిజి వైద్య విద్య అభ్యసించడానికి ఆటంకంగా మారిందని చెప్పారు. ఇది వైద్యవృత్తిలో వైద్యులు ప్రగతికి ఆటంకమని అభిప్రాయపడ్డారు. కోవిడ్ సమయంలో ప్రాణాలు తెగించి వైద్యులు సేవలందించారని, అటువంటి వైద్యుల ప్రగతిని ఆపే ఈ జిఒని వెనక్కి తీసుకోవాలని కోరారు.

'చంద్రబాబుపై విమర్శలు తగవు'

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

వరద బాధితులకు 10 రోజులుగా సేవలందిస్తున్న సిఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శలు చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రానికి దాపురించిన విపత్తును దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాల ప్రజలు పార్టీలకతీతంగా సాయం అందిస్తున్నారని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధునిక సాంకేతకతను ఉపయోగించి అనతి కాలంలోనే గండ్లు పూడ్చివేయడమే కాకుండా డ్రోన్ల సహాయంతో బాధితులను ఆదుకున్నారని చెప్పారు. దీన్ని చూసి దేశం ఒక వైపు మెచ్చుకుంటుంటే, మాజీ ముఖ్యమంత్రి ఆర్థికంగా ఎటువంటి సహాయమూ అందించక, చేస్తున్న వారిపై విమర్శలకు దిగడం తగదని పేర్కొన్నారు.

జెసికి వినతి అందజేసేందుకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉలిపిరి బాలికల ఆశ్రమ పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-పార్వతీపురం

కొమరాడ మండలంలోని ఉలిపిరి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పరిస్థితులు, సమస్యల గురించి ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘాలు ఆధ్వర్యాన పాఠశాల విద్యార్థుల తల్లితండ్రులతో కలిసి జాయింట్ కలెక్టర్ శోబికకు వినతి పత్రం అందించారు. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సమయానికి పాఠశాలకు రావడం లేదని చెప్పారు. ఉదయం 11 గంటలకు వచ్చి సాయంత్రం మూడు గంటలకే పాఠశాల విడిచి వెళ్లిపోతున్నారని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావుపై గతంలో అనేక ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. కురుకుటి ఆశ్రమ బాలికల పాఠశాలలో బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన చేశారని తెలిపారు. ఆయనపై పోక్సో చట్టం కింద కేసు నమోదైందని చెప్పారు. అక్కడి నుంచి తప్పించి ఉలిపిరి పాఠశాలలో డిప్యుటేషన్‌పై నియమించారని వివరించారు. ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు సరిగా బోధించడం లేదని ఫిర్యాదు చేశారు. మంచి గదులు ఉపాధ్యాయులు తీసుకుని, పెచ్చులూడిపోతున్న గదులకు పిల్లలను పంపించారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.సురేష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రామస్వామి, జెఎసి నాయకులు మల్లయ్య, ఎస్ఎంసి చైర్‌పర్సన్ ఎం.గౌరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జయకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వీరఘట్టం

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ జన్మదిన వేడుకలను ఆయన స్వగ్రామైన ఎం.రాజపురంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో కూటమి కార్యకర్తలు, అభిమానుల పెద్ద ఎత్తున రావడంతో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కేక్ కట్ చేశారు.

సీతంపేట : ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ జన్మదిన వేడుకలు సీతంపేటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు సవరతోట ముఖలింగం, సర్పంచ్ అప్పారావు, నీలయ్య, కుమార్, ఉపసర్పంచ్ రాజారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్, ఐటిడిపి ఇన్‌ఛార్జి ఇమరక పవన్, ప్రభు కుమార్ పాల్గొన్నారు.

తిరుపతిరావు మృతి తీరనిలోటు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి-పాచిపెంట

తిరుపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

దన్నాన తిరుపతిరావు మాస్టారు మృతి విద్యార్థులకు, విద్యావ్యవస్థకు తీరనిలోటని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. నెల్లిమర్ల మండలం పారసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించి.. అకాల మరణం పొందిన దన్నాన తిరుపతిరావు స్వగ్రామం పాచిపెంటలో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ ఓదార్చారు. ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా ఉపాధ్యాయ సమస్యలపై, పాఠశాల అభివృద్ధికి సంబంధించి సేవాభావంతో పనిచేశారని రఘువర్మ కొనియాడారు. ఆ కుటుంబానికి తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, పాచిపెంట ఎంపిటిసి దండి ఏడుకొండలు, వైసిపి నాయకులు సలాది అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గారావు కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి -వీరఘట్టం

విక్రంపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు అలజంగి దుర్గారావు కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. దుర్గారావు సతీమణి జ్యోతి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ గ్రామానికి చేరుకుని పరామర్శించారు. ఆయనతోపాటు ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, సర్పంచి మాచర్ల వెంకటరమణ, పాలవలస ధవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.